సాక్షి
జోగులాంబ గద్వాల

మంగళవారం : 27 : మే : 2025



మోక్షమెప్పుడో..?
మిషన్ భగీరథ నీటి సరఫరా కోసంపైపులైన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.
వివరాలు 8లో ▸



పాఠశాలలు బలోపేతం
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని విద్యా కమిషన్ చైర్మన్ మురళి అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 34.6 /23.4

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ప్రజావాణి'కి 48 ఫిర్యాదులు

గద్వాల: వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం హాలులో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలు 48 ఫిర్యాదులు అందించారు. కలెక్టర్ నేరుగా స్వీకరించి వాటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపించారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కాని పక్షంలో అందుకు గల కారణాలు వివరిస్తూ సంబంధిత ఫిర్యాదుదారుడికి అక్నాలెడ్జ్‌మెంట్ ద్వారా తెలియజేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 16 అర్జీలు



గద్వాల క్రైం: పోలీస్ గ్రీవెన్స్‌కు మొత్తం 16 అర్జీలు వచ్చాయి. ఎస్పీ శ్రీనివాస్‌రావు బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. భూ వివాదం, ఆస్తి తగదాలు, అప్పుగా తీసుకున్న వ్యక్తులు డబ్బులు చెల్లించడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ బాధితులకు వివరించారు. సివిల్ సమస్యలపై కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాలని సూచించారు.

నేడు పీఎఫ్ సమస్యలపై సదస్సు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికిగాను మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో 'నిధి ఆప్కే నిక్కత్-2' నిర్వహించనున్నామని రీజినల్ పీఎఫ్ కమిషనర్-1 తేజ్‌ప్రతాప్‌సింగ్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు సదస్సులు మహబూబ్‌నగర్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్, నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్యాలయం, వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ కార్యాలయం, నారాయణపేట జిల్లా నర్వ మండలం లంకాలలోని ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ (బీడీ మాన్యుఫ్యాక్చర్స్), గద్వాల పీఏసీఎస్‌లో, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో, వికారాబాద్ జిల్లా తాండూరులోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలో కొనసాగుతాయన్నారు. అలాగే హైదరాబాద్ పరిధిలోని షేక్‌పేట్ నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాలలో, హైదరాబాద్ పీఎఫ్ రీజినల్ ఆఫీస్-2లో జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని పీఎఫ్ ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రామన్‌పాడులో 1,016 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం సముద్ర మట్టానికిపైన 1,016 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, కుడి కాల్వల ద్వారా జలాశయానికి నీటి సరఫరా నిలిపివేశారని.. రామన్‌పాడు జలాశయం నుంచి కుడి, ఎడమ కాల్వలకు 12 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

నేడు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో మంగళవారం 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు బాలురు, బాలికలను ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. స్థానిక మినీ స్టేడియంలో అండర్-8 బాలురు, బాలికల విభాగంలో 60తోపాటు 200 మీటర్ల పరుగు పందెం, టెన్నిస్ బాల్ త్రో, అండర్-10 బాలురు, బాలికల విభాగంలో 60తోపాటు 300 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, కిడ్స్ జావెలిన్ త్రో, అండర్-12 బాలురు, బాలికల విభాగంలో 60, 300, 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని, వీరు జూన్ 1వ తేదీన సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

నమ్మించి.. నట్టేట ముంచి



భూ సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

- అమాయక రైతులే లక్ష్యంగా దోచుకుంటున్న మధ్య దళారులు
- భూ వివాదాలు పరిష్కరిస్తామని.. పాసుబుక్కులు ఇప్పిస్తామని బుకాయింపు
- రూ.లక్షలు వసూలు చేసి మొఖం చాటేస్తున్న వైనం
- పట్టణ పోలీసు స్టేషన్‌లో తాజా కేసు నమోదుతో వెలుగులోకి..

గద్వాల క్రైం: భూ సమస్యలు.. పాసు బుక్కులు.. ఆన్‌లైన్‌లో పేర్ల మార్పు.. తదితర సమస్యలను పరిష్కరించాలని రైతులు అటు అధికారులకు వినతులు.. ఇటు ప్రజావాణి.. ప్రజాదర్బార్‌లో దరఖాస్తులు చేస్తుంటారు. ఇలాంటి బాధితులనే లక్ష్యంగా చేసుకున్న కొందరు కేటుగాళ్లు.. భూములకు సంబంధించి ఏ సమస్య అయినా పరిష్కరిస్తామని నమ్మబలుకుతున్నారు. వీరి మాటలు నమ్మిన రైతులు రూ.లక్షలు వారికి అందజేయడం.. ఆ తర్వాత మోసపోయామని తెలుసుకొని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన ఘటనలు జిల్లాలో కో కొల్లలుగా ఉన్నాయి.

జిల్లాలో కొన్ని సంఘటనలు..

గద్వాల పట్టణానికి చెందిన ఓ మహిళా రైతు పేరుపై 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే సాంకేతిక సమస్యల కారణంగా రెవెన్యూ రికార్డులో పేరు నమోదు కాలేదు. ఈ క్రమంలో ఆమెతోపాటు అతని సోదరుడు హైద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడే ఓ దళారీ నేను ఓఎస్‌డీలో విధులు నిర్వహిస్తున్నట్లు నమ్మించి భూభారతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేయించేందుకు ఈ ఏడాది మార్చిలో రూ.1.45క్షలు వసూలు చేశాడు. అయితే నెల రోజులైనా ఎలాంటి ఫలితం లేక పోయింది.


FIRST INFORMATION REPORT

హైదరాబాద్‌కు చెందిన దళారీపై గద్వాల పట్టణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్

దీంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించి 24.05.2025 తేదీన హైద్రాబాద్‌కు చెందిన దళారీపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

❒ గద్వాల పట్టణానికి చెందిన ఓ రైతు వ్యవసాయ భూమి గద్వాల మండలంలోని పరుమాలలో ఉంది. అయితే అక్రమార్కులు ఆ భూమిపై నకిలీ పాసుబుక్కులు సృష్టించి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలను పొందుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో హైకోర్టులో న్యాయం కోసం ఫిర్యాదు చేయగా కోర్టు రైతుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే రైతుకు న్యాయం చేయాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని 26.5.2025 తేదీన కలెక్టర్, ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశాడు. బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటనలో రైతు రూ.4లక్షలు దళారులకు ఇచ్చి మోసపోయాడు.

❒ రాజోళి మండలానికి చెందిన ఓ రైతు తన రెండు ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పాసుబుక్కుల కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. వివిధ సమస్యల కారణంగా పాసుబుక్‌ల జారీ ఆలస్యమైంది. దీంతో రైతు గద్వాలకు చెందిన ఓ దళారీని ఆశ్రయించాడు. అందుకు రూ.50వేలు ఒప్పందం చేసుకున్నాడు. ఆరు నెలలు అయినా దళారీ పాసుబుక్కు ఇప్పించడం లేదని 17.3.2025 తేదీన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. జిల్లా వ్యాప్తంగా ఇలా ఎంతో మంది రైతులు భూసమస్యలపై రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ, సమస్యల పరిష్కారం లేకపోవడంతో దళారులను ఆశ్రయించి మోసపోతున్నారు.

దళారులను నమ్మొద్దు



జిల్లాలోని రైతులు ఎవరూ భూ సమస్యలపై మధ్య దళారులను ఆశ్రయించొద్దు. చట్టబద్ధంగా సమస్యలు పరిష్కారం చేసుకోవాలి. డబ్బులు ఇస్తే పనులు అవుతాయి అంటే అక్కడ ఖచ్చితంగా మోసం జరుగుతుందని గ్రహించాలి. పలు సాంకేతిక సమస్యల కారణంగా సమస్య పరిష్కారంలో జాప్యం జరగవచ్చు. మోసపోయిన రైతుల విషయంలో విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం అందేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఎస్పీ

ప్రభుత్వ భూములపై దళారుల నజర్...

గద్వాల – అలంపూర్ సెగ్మెంట్‌లలో సీలింగ్, వక్ఫ్, దేవాదాయ, ప్రభుత్వ భూములు ఉండగా.. వీటిని సైతం దళారులు, భూకబ్జాదారులు రెవెన్యూలోని సాంకేతిక లొసుగులను ఆసరాగా చేసుకొని పట్టా భూములుగా మార్చుకున్నారు. వాస్తవంగా ప్రభుత్వ భూముల క్రయ విక్రయాలు నిర్వహించరాదనే నిబంధనలు ఉన్నాయి. భూ బాదలాయింపు జరగాల్సి ఉంటే అట్టి భూములను వారసుల పేరిట రెవెన్యూ రికార్డులో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ప్రభుత్వ భూములు సైతం దళారుల చేతివాటంతో రికార్డులు తారుమారు అవుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా అలంపూర్, గట్టు, కేటీదొడ్డి, వడ్డేపల్లి, అయిజ, గద్వాల, మానవపాడు మండలాల్లో భూ సమస్యలపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి. వీటిని ఆసరాగా చేసుకుంటున్న దళారులు రైతులను నమ్మించి దోచుకుంటున్నారు.

ప్రాధాన్యతా క్రమంలో.. ప్రాజెక్టులు పూర్తిచేస్తాం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

- పాలమూరును అభివృద్ధి చేసే బాధ్యత మాది
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- బీఆర్ఎస్ పనులు చేపట్టింది తప్పా పూర్తిచేయలే..
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

అచ్చంపేట/ బల్మూర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, కేఎల్ఐతోపాటు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రణాళిక, జీఓ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చినవేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాలమూరు- రంగారెడ్డి, అచ్చంపేట ఎత్తిపోతలు, ఉమామహేశ్వరం రిజర్వాయర్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించి.. ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్ మండలం గట్టుతుమ్మెన్‌లో రూ.43 కోట్లతో చేపట్టనున్న పలు విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అభివృద్ధి పనులు మొదలు పెట్టిందే తప్ప పూర్తి చేయలేదని విమర్శించారు. అచ్చంపేట నియోజవర్గానికి, తమకు విడదీయని బంధం ఉందని, అన్న మల్లు అనంతరాములుతోపాటు మల్లు రవి ఇక్కడి నుంచే ఎన్నికల్లో పోటీ చేశారని, తాను అప్పట్లో విద్యాభ్యాసం చేస్తూ ఇక్కడికి వచ్చానని గుర్తుచేసుకున్నారు.

పదేళ్లలో ఒక్క ఉద్యోగం ఇవ్వలే..

నీళ్లు, నిధులు, నియామకాలంటూ కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్న యువతకు గత పాలకులు అన్యాయం చేశారని డిప్యూటీ సీఎం విమర్శించారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ ఒక్కసారి కూడా గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేకపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే లక్ష ప్రభుత్వ ఉద్యోగాల కలను సాకారం చేశామని, ఇప్పటికే 57 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగ నియామకాల ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. రూ.12,600 కోట్లతో నల్లమల డిక్లరేషన్ చేసిందని, దేశ చరిత్రలో ఎవరూ ఇప్పటి వరకు ఈ ఆలోచన చేయలేదని వివరించారు. ఇందిర సౌర గిరి జల వికాసం పేరిట నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలిచ్చిన 6.70 లక్షల ఎకరాలకు సోలార్ కరెంట్, పంపుసెట్లు, డ్రిప్ స్ప్రింక్లర్లను వినియోగించి ఉద్యానశాఖ ద్వారా ఉచితంగా అవకాడో, వెదురు, నిమ్మ వంటి మొక్కలను ఉచితంగా గిరిజన రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యమని.. మొదటి సంవత్సరం రూ.21 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ ముషారఫ్ అలీ ఫారూఖీ, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ అధ్యక్షుడు మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్, జిల్లా ఓబీసీ చైర్మన్ గిరివర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరం..

ఉమ్మడి రాష్ట్రంలో 21 మంది ముఖ్యమంత్రుల పాలనలో రూ.65 వేల కోట్ల అప్పులు చేస్తే.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అగమ్యగోచరంగా మార్చారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ కోతలేనని ప్రచారం చేశారని.. రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి చేతికిచ్చినా నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నామన్నారు. దేవుడి చుట్టూ దెయ్యాలంటూ కవిత లేఖ రాయడం చూస్తే దెయ్యాలకు నాయకత్వం వహించిన వారు దేవుడెలా అవుతాడని ప్రశ్నించారు.

భూ సమస్యల పరిష్కారంలో సర్వేయర్ల పాత్ర కీలకం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: లెసెన్స్ సర్వేయర్లతో భూవివాదాలకు పరిష్కారం దొరకడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పాత ఎంపీడీవో ఆఫీసులో ఏర్పాటు చేసిన లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి భూమి హక్కుల రికార్డు చట్టం-2025ను అమలులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. భూయజమానులైన రైతులకు మెరుగైన సేవలను అందించే ప్రణాళికలో భాగంగా లైసెన్స్ పొందిన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టం ప్రకారం భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, తదితర వాటిలో తప్పనిసరిగా సర్వే చేసి మ్యాప్ జత చేయాల్సి ఉంటుందని దీనికోసం లైసెన్స్ సర్వేయర్లను ఎంపిక చేసి వారికి ప్రభుత్వం శిక్షణ అందిస్తుందన్నారు. మే 26వ తేదీ నుంచి 50రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈశిక్షణ కార్యక్రమంలో థియరీతో పాటు, ఫీల్డ్‌ట్రైనింగ్ కూడా ఉంటుందన్నారు. అదేవిధంగా శిక్షణ కాలంలో సెలవులు ఇవ్వరని అందరూ కూడా తప్పకుండా హాజరు కావాలన్నారు. అందులో ఉత్తీర్ణులైన వారికి లైసెన్స్‌డ్ సర్వేయర్ సర్టిఫికెట్ జారీ చేయబడుతుందన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఏడీ రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యం



గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌లో నీటికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని, రైతులు సమన్వయంతో నీటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామ సమీపంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం పేస్ 1 నుంచి పంపుహౌస్‌ను ఎమ్మెల్యే హాజరై గంగమ్మ పూజ చేసి సాగు నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురవడంతో కృష్ణ నదిలో నీటి సామర్థ్యం పెరిగిందని అన్నారు. దీంతో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేశామని, ఈ ఏడాది రైతులకు రెండు పంటలకు నీళ్లను అందించడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేసిందని, ఇప్పటి వరకు 80 శాతం ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసిందని, మిగిలిన 20 శాతం త్వరలో కొనుగోలు చేయనుందని తెలిపారు. ర్యాలంపాడు.. నాలుగు టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లు ప్రస్తుతం రెండు టీఎంసీల నీళ్లు నిలువ ఉంటుందని, రెండు టీఎంసీలలో కొంత ఇబ్బందిగా ఉందని, విషయాన్ని నీటిపారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జంబురామన్ గౌడు, సుదర్శన్ రెడ్డి, రామకృష్ణ నాయుడు, విజయ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

గద్వాల: గద్వాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం, భూనిర్వాసితుల కోసం ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరీ చేసినట్లు తెలిపారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేసి, దాని కింద ఉన్న పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ 1.5టీఎంసీల సామర్థ్యం నుంచి 20టీఎంసీల సామర్థ్యానికి పెంచితేనే గద్వాలతో పాటు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సైతం సాగు, తాగునీటి కష్టాలు తొలగిపోతాయని ఆ దిశగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై సర్వే చేసేందుకు ప్రభుత్వం రూ.16.20లక్షల నిధులు మంజూరీ చేసిందన్నారు. అదేవిధంగా దేశానికే గద్వాల ప్రాంతం నుంచి 40శాతం కాటన్‌సీడ్ అందిస్తుందని, అలాంటిది ప్రస్తుతం కాటన్‌సీడు పక్క రాష్ట్రాలకు తరలివెళ్తుండడం ఆందోళన కలిగించే పరిణామం అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు జూన్ 2వ తేదీన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాను ఏ పార్టీలో ఉన్నా వ్యక్తిగత ప్రయోజనం కంటే నియోజకవర్గ అభివృద్ధి కోసమే కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ హనుమంతు, జంబురామన్‌గౌడ, శ్రీకాంత్‌రెడ్డి, ఉరుకుందు, తిక్కన్న, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



జీలుగ విత్తనాలు అందజేస్తున్న హనుమంతు, సుభాన్

గద్వాల వ్యవసాయం: సబ్సిడీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతు సూచించారు. సోమవారం గద్వాల సింగిల్‌విండో కార్యాలయంలో సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాల విక్రయ కార్యక్రమాన్ని పీఏసీఎస్ చైర్మన్ సుభాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 30 కేజీల జీలుగ విత్తనాలను సబ్సిడీ ధర్మపై రూ. 2,137.50 ఇస్తుందని తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సుభాన్ మాట్లాడుతూ పచ్చిరొట్టె ఎరువు వాడటం వల్ల పంటకు పోషకాలు అందుతాయని, నేల గుల్ల బారి నీటిని నిలుపుకొనే సామర్థ్యం పెరిగి, వేరు వ్యవస్థ భూమిలోకి పటిష్టంగా పెరుగుతుందన్నారు. దీంతో పాటు భూమిలో నత్రజని శాతం పెరుగుతుందన్నారు. అనంతరం పలువురు రైతులకు సబ్సిడీ జీలుగ విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రతాప్‌కుమార్, పీఏసీఎస్ సీఈఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.4,340

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 60 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 4340, కనిష్టం రూ.1740, సరాసరి రూ.2600 ధరలు పలికాయి. అలాగే, 18 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ.5891, కనిష్టం రూ. 4800, సరాసరి రూ. 5891 ధరలు లభించాయి. 161 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.1959, కనిష్టం రూ. 1579, సరాసరి రూ.1790 ధరలు వచ్చాయి. 2 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి రూ. 6009 ధర పలికింది.



రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీరాం

తాడూరు: రైతులు సాగు చేసే పంటల్లో యూరియాతో పాటు రసాయనిక ఎరువులను తగ్గించాలని పాలెం కేవీకే శాస్త్రవేత్తలు శ్రీరాం అన్నారు. సోమవారం మండలంలోని బలాన్‌పల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్త శ్రీరాం మాట్లాడుతూ పంట మార్పిడితో భూసారం పెరుగుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రశీదులు భద్రపర్చుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త రాజిరెడ్డి మాట్లాడుతూ పురుగు మందులు అవసరం ఉన్నప్పుడే మాత్రం పిచికారి చేయాలన్నారు. నేల తేమ సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధికారులు సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు కార్యక్రమంలో ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డి, ఏఈఓ దీపక్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిరుతను బంధిస్తాం



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఫింజర్ గుట్టపై వారం రోజులుగా చిరుత సంచరిస్తుండటంతో సోమవారం అటవీ శాఖ అధికారులు డీఆర్‌ఓ రాజశేఖర్, రాఘవేందర్‌రెడ్డి, ఉమేష్ కొండపై చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుత సంచారంతో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని సూచించారు. చిరుతను బంధించేందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని బోను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఫ్రిజ్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం

మక్తల్: ఫ్రిజ్ సిలండర్ పేలి అగ్ని ప్రమాదం మక్తల్ పట్టణంలో సంగంబండ రోడ్డు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. మక్తల్‌లో ఆనంద్‌బాబు ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. నాలుగు రోజుల నుంచి ఇల్లు తాళం వేసి సొంత ఊరుకు వెళ్లాడు. ఇటీవల కరెంటు సరఫరా ఎక్కువ, తక్కువ కావ డంతో ఫ్రిజ్ సిలిండ్ పేలి పెద్దగా పొగలు వచ్చాయి. దీంతో పక్కింటి వారు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

సమస్యలు పరిష్కరించాలని రైతుల ఆందోళన



మద్దూరు: మద్దూరు మండలాన్ని భూ భారతిలో పైలెట్ మండలంగా ఎంపిక చేశారు. అయినా మా భూ సమస్యలను పరిష్కరిచండం లేదని రెనివట్ల గ్రామానికి చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అంతకుముందే నారాయణపేట కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రెనివట్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 319, 320, 359, 360, 210, 546, 565లో 66 ఎకరాల 11గుంటల ఇనాం భూమి ఉందన్నారు. ఈ భూమి చిన్నయ్య, మ ల్లప్ప, బాలప్ప, వెంకటప్ప పేర్ల మీద నాలుగు పెద్ద బాగాలున్నట్లు తెలిపారు. వారి వారసుల్లో కొంత మంది భూములు అమ్ముకొని వెళ్లిపోయారు. కానీ రికార్డుల్లో వారి పేర్లే ఉన్నాయి. ఈ సర్వే నంబర్ల భూమి ఇనామ్ రద్దు చేసి మాకు ఓఆర్‌సీ ఇచ్చి భాగ పరిష్కారం చేయాలన్నారు. భూ భారతిలో పెట్టుకు న్న అధికారులు స్పందించడం లేదని ఆందోళన చేపట్టారు. ఈ భూముల వ్యవహారంలో అధికారులకు ముడుపులు ముట్టజెప్పిన పనులు కావడం లేదని రైతులు ఆరోపించారు. కొత్త చట్టం ద్వారా మా సమస్య పరిష్కారం చేయాలని ఆందోళన చేపట్టినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ మహేష్‌గౌడ్ రైతులు సమస్యను విని రాతపూర్వకంగా దరఖాస్తు చేయాలన్నారు. పాత రికార్డులను పరిశీలించి, పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కొత్త ఆశప్ప, చిట్టి కన్కప్ప, జగన్, చిన్న కేవప్ప, హన్మంతు, బోడ శ్రీనివాస్, డబ్బ అశోక్, రాసం కన్కప్ప, చెవుల మోహన్, సాయమ్మ, ప్రమీల, మొగులప్ప, లక్ష్మి, గోవిందు, శేఖర్, నీలప్ప, భీమప్ప ఉన్నారు.

కందూర్‌లో గొర్రెల చోరీ

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో 20 గొర్రెలు చోరీకి గురైనట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలయ్య, రమేష్, రవి కలిసి ఆదివారం మహబూబ్‌నగర్ మండలంలోని జమిస్తాపూర్‌లో 60 గొర్రెలను కొనుగోలు చేసి కందూర్‌కు తీసుకొచ్చారు. వాటిని రాత్రి బాలయ్య ఇంటి వద్ద ఉంచారు. వాటికి కొంత దూరంలోనే కాపలా ఉన్నారు. వర్షం రావడంతో సమీపంలో ఉన్న కిరాణం షాపు వద్దకు వెళ్లి అక్కడే ఉన్నారు. అయితే ఉదయం లేచి చూస్తే 40 గొర్రెలు మాత్రమే ఉండటంతో 20 గొర్రెలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్త పైప్‌లైన్‌కు మోక్షమెప్పుడో?



కురుమూర్తి గ్రామంలోని మిషన్ భగీరథ పథకం సంపు

- పాత పైప్‌లైన్‌తోనే 13 గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా
- తరచుగా లీకేజీలు ఏర్పడుతున్న వైనం
- తాగునీటి సరఫరాలో అంతరాయంతో ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

చిన్నచింతకుంట: మిషన్ భగీరథ పథకం నీటి సరఫరా కోసం కొత్త పైప్‌లైన్ నిర్మించక పోవడం మండల ప్రజలకు శాపంగా మారింది. పాత పైప్‌లైన్ తరచుగా లీకేజీలు అవుతుండటంతో తాగునీటి సమస్య తలెత్తుతోంది. మరోవైపు స్వచ్ఛమైన తాగునీరు కలుషితమవుతున్నాయి. కురుమూర్తి గ్రామ సమీపంలోని మిషన్ భగీరథ సంప్ నుంచి కొకుంట్ల మండలం ముచ్చింతల వరకు 10 కి.మీ.మేర కొత్త పైప్‌లైన్ నిర్మించలేదు. పాత పైప్‌లైన్‌కే మిషన్ భగీరథ పథకం కనెక్షన్ ఇచ్చారు. దీంతో పాత పైప్‌లైన్ నిత్యం ఏదో ఒకచోట లీకేజీ ఏర్పడుతోంది. ఫలితంగా చిన్నచింతకుంట మండలంలోని 13 గ్రామాలకు తాగునీటి సమస్య తలెత్తుతోంది.



తిర్మలాపూర్‌లో పైప్‌లైన్ లీకేజీ

40ఏళ్ల క్రితం నాటి పైప్‌లైన్..

సాయిబాబా ట్రస్టు వారు 40ఏళ్ల క్రితం రామన్‌పాడు నుంచి చిన్నచింతకుంట మండలానికి పైప్‌లైన్ ఏర్పాటుచేసి తాగునీటిని అందించారు. అయితే, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో కొత్త పైప్‌లైన్ నిర్మించాల్సి ఉండగా.. సంబంధిత అధికారులు విస్మరించారు. కురుమూర్తి సమీపంలో నిర్మించిన తాగునీటి సంప్ నుంచి ముచ్చింతల వరకు ఉన్న పాత పైప్‌లైన్‌కే మిషన్ భగీరథ పైప్‌లైన్ కలిపారు. దీంతో పాత పైప్‌లైన్‌కు తరచుగా లీకేజీలు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతు చేయించడం.. మళ్లీ ఏదో చోట పైప్‌లైన్ పగిలిపోవడం పరిపాటిగా మారింది. ఫలితంగా చిన్నచింతకుంట, కురుమూర్తి, అమ్మాపురం, గూడూర్, మద్దూర్, ఏదులాపురం, కొకుంట్ల మండలంలోని తిర్మలాపూర్, దాసర్‌పల్లి, అప్పంపల్లి, ముచ్చింతల, రాజోళి తదితర గ్రామాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

తరచుగా సమస్య..



మండలంలోని గ్రామాలకు పాత పైప్‌లైన్ ద్వారానే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. దీతో తరచుగా లీకేజీలు ఏర్పడుతూ తాగునీటి సమస్య ఏర్పడుతుంది. మరోవైపు తాగునీరు కలుషితం అవుతున్నాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొత్త పైప్‌లైన్ నిర్మించాలి.

– కాంతారావు, మాజీ సర్పంచ్, గూడూరు

ప్రతిపాదనలు పంపించాం..

రామన్‌పాడు నుంచి 13 గ్రామాలకు నీటిని సరఫరాచేసే పాత పైప్‌లైన్ తొలగించి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతాం. ప్రస్తుతం ఎక్కడ లీకేజీలు ఏర్పడినా వెంటనే సరిచేసి గ్రామాలకు తాగునీరు అందిస్తున్నాం.

– వినోద్, ఏఈ, మిషన్ భగీరథ పథకం

తాగునీరు కలుషితం..

తాగునీటి పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైపులైన్ నిర్మాణానికి ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నో ఏళ్ల నాటి పాత పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తుండటం.. తరచూగా లీకేజీలు ఏర్పడుతుండటంతో చెత్తాచెదారం, నాసుతో కూడిన నీరు సరఫరా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యను తాగునీటి సమస్యను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారం కోసం కొత్త పైప్‌లైన్ నిర్మించాలని కోరుతున్నారు.



అప్పంపల్లి బస్టాండ్ వద్ద లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ నీరు

బేస్‌మెంట్ బిల్లులు అందాయా..



భట్టుపల్లిలో వీసీలో మంత్రితో మాట్లాడుతున్న ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు జుమ్మి

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుతో వీసీలో మాట్లాడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

భూత్పూర్: బేస్‌మెంట్ బిల్లులు అందాయా అని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో సోమవారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మండలంలోని భట్టుపల్లిలో 13 మంది లబ్ధిదారులు బేస్మెంట్ వరకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోగా వారికి రూ.లక్ష చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సబావట్ జుమ్మి తనతోపాటు బేస్మెంట్ వరకు నిర్మాణం చేపట్టిన వారికి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేశారని, తనకు ఎంతో సంతోషంగా ఉందని మంత్రికి వివరించారు. తాను రేకుల షెడ్డులో నివాసం ఉంటూనే తన కుమారుడు బీటెక్, కుమార్తె లా కోర్సు చదివిస్తున్నానని చెప్పడంతో మంత్రి జుమ్మిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో మీలాంటి మహిళలు తమ పిల్లలకు ఉన్నత స్థాయి చదువులు చెప్పించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కర్, ఎంపీడీఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యనా.. ప్రమాదమా ?

- హత్య చేశారంటూ కుటుంబ సభ్యుల అనుమానం
- చెరువు గట్టున విద్యుత్ తీగలపై మృతదేహం
- కేసు నమోదు



కుర్వ నర్సింహ మృతదేహం

గట్టు: మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం కలకలం రేపింది. ప్రమాదం కాదు హత్య అని బాధిత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తు ఆందోళన చేశారు. వివరాలు.. ఆలూరు గ్రామానికి చెందిన కుర్వ నర్సింహ(35) ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో చికెన్ ఇచ్చి బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లినట్లు భార్య పల్లవి తెలిపారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో నర్సింహకు ఫోన్ చేయగా స్విఛాఫ్ వచ్చిందని తిరిగి సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు మరోమారు చేయగా ఫోన్ స్విఛాఫ్ రావడంతో ధరూరులో ఉండే మరిది రమేష్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం వాయిల్‌కుంటతండా వాసులు చెరువు గట్టున వ్యక్తి మృతి చెంది ఉన్న విషయాన్ని గుర్తించి ఆలూరు గ్రామస్తులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆలూరుకు చెందిన కుర్వ నర్సింహ(35)గా గుర్తించారు. మృతుడు విద్యుత్ తీగలపై పడి ఉంటడాన్ని గమనించి ప్రమాదం కాదు హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. మృతుని ద్విచక్రవాహనం గ్రామ చావిడి దగ్గరే ఉందని, వాయిల్‌కుంటతండా దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన స్వాములు, తిమ్మప్ప, గోకారన్న, గోవిందు, నరేంద్రనాయక్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ మల్లేష్ వివరాలు సేకరించారు. మృతుని భార్య పల్లవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య పల్లవి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వచ్చేనెల 11న రాష్ట్రస్థాయి సెమినార్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో వచ్చే నెల 11 నుంచి 12 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు పీయూ వీసీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వర్క్‌షాప్ బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పీయూ పరిధిలో మారిన నూతన సిలబస్, నూతన విద్యావిధానం లక్ష్యాలు, పరిశోధన ఆధారిత బోధన, రీసెర్చి మెథడాలజీ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో అధ్యాపకులకు అవగాహన కల్పిస్తామన్నారు. నాణ్యమైన ఆవిష్కరణ పద్ధతులను నొక్కి చెప్పే ప్రస్తుత విద్యా దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకుని అధ్యాపకుల సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఎంఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, హెచ్‌ఓడీ ఆంజనేయులు, ఓయూ ప్రొఫెసర్ సుజాత, దుర్గేశం, చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పీయూ నాన్‌టీచింగ్ ఉద్యోగి బుర్రన్నను వీసీ పరామర్శించారు.

సుంకేసులకు 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు సోమవారం ఎగువ నుంచి 4,496 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి వచ్చిన నీటిని అంతే స్థాయిలో రెండు గేట్లను తెరిచి దిగవకు వదిలినట్లు చెప్పారు. అలాగే కేసీ కెనాల్‌కు మరో 159 క్యూసెక్కులను వదిలినట్లు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం



పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఆకునూరి మురళి

- ప్రజాభిప్రాయం మేరకే నిర్ణయాలు
- వంగూరులో ఒకే గొడుగు కిందకు ప్రభుత్వ పాఠశాలలు
- రూ.11 కోట్లతో అభివృద్ధి
- రాష్ట్ర విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళి


వంగూరు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ ప్రజాభిప్రాయం మేరకే విద్యాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర విద్యాకమీషన్ చైర్మన్ ఆకునూరి మరళి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, తీసుకోవాల్సిన నిర్ణయాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం కలగాలంటే ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలని అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంగూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, కస్తూర్బా పాఠశాల, జూనియర్ కళాశాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ నాలుగు పాఠశాలలకు దాదాపు 8 ఎకరాల స్థలం ఉందని, ఈ స్థలంలో తరగతి గదులు, క్రీడాప్రాంగణాలు, ల్యాబ్‌లు, డైనింగ్ సెక్షన్లను ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో లేని వసతులు కల్పించేందుకు రూ.11 కోట్లు దాతల నుంచి సేకరించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం పేరెంట్స్ కమిటీతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో విద్యావిధానంలో పెనుమార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే వంగూరు పాఠశాలలను నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసి సెమిరెసిడెన్షియల్‌గా మార్చేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్‌సౌకర్యం కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 16న ఇదే పాఠశాలలో మరో సమావేశం నిర్వహించిన అనంతరం అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని వెల్లడించారు. సమావేశంలో విద్యా కమీషన్ సభ్యులు చారకొండ వెంకటేష్, జ్యోత్స్నారెడ్డి, డీఈఓ రమేష్‌కుమార్, ఎంఈఓ మురళీమనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు కోసం..

కరీంనగర్‌లో దరఖాస్తు.. మహబూబ్‌నగర్‌లో మంజూరు

- అధికారుల తప్పిదంతో లబ్ధిదారుడికి అవస్థలు

మహబూబ్‌నగర్ రూరల్: రేషన్ కార్డు కోసం కరీంనగర్ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడికి మహబూబ్‌నగర్ జిల్లాలో మంజూరు అయింది. అధికారుల తప్పిదం కారణంగా అక్కడ జారీ చేయాల్సిన కార్డు ఇక్కడ రావడంతో లబ్ధిదారుడికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని మంకమ్మతోటకు చెందిన మాడిశెట్టి లక్ష్మణ్ కొత్త రేషన్ కార్డు కోసం తన ఆధార్ కార్డు గుర్తింపుగా స్థానికంగా దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన కార్డు జారీకి సంబంధించిన ప్రక్రియ నిర్వహించిన సంబంధిత శాఖ సిబ్బంది, అధికారులు కార్డు కోసం కరీంనగర్‌కు బదులుగా మహబూబ్‌నగర్ అని కంప్యూటర్‌లో పొందుపరిచారు. దీంతో ఆయనకు మహబూబ్‌నగర్‌లోని 1425022 రేషన్ షాపును కేటాయించారు. తనకు పొరపాటున జారీ చేసిన కార్డును రద్దు చేసి కొత్తది తాను నివాసం ఉంటున్న ప్రాంతంలో ఇవ్వాలని కరీంనగర్ జిల్లా అధికారులకు విన్నవించుకోగా.. మహబూబ్‌నగర్ జిల్లాలో జారీ చేసిన కార్డు రద్దు చేస్తేనే నూతనంగా కరీంనగర్ జిల్లాలో కార్డు జారీ చేస్తామని తిరకాస్తు పెట్టారు. అంతేకాక అధికారులు చేసిన తప్పిదానికి తనను బలి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎలాగైనా తనకు కరీంనగర్ జిల్లాకు సంబంధించిన కార్డు జారీ చేయాలని లక్ష్మణ్ కోరుతున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లాలో లక్ష్మణ్‌కు నూతనంగా జారీ చేసిన రేషన్ కార్డు

కార్డును రద్దు చేస్తాం..

కరీంనగర్ తహసీల్దార్ కార్యాలయంలో నమోదు మేరకు రేషన్ కార్డు మహబూబ్‌నగర్‌లో జారీ అయ్యిందని మహబూబ్‌నగర్ జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ తెలిపారు. అక్కడి అధికారుల పొరపాటు కారణంగా ఇక్కడి జారీ అయిన కార్డును రద్దు చేసి లబ్ధిదారుడికి అసౌకర్యం కలగకుండా చూస్తామని పేర్కొన్నారు.

వికసించిన మే పుష్పం



సంవత్సరంలో ఒకసారి మాత్రమే పూసే అరుదైన మే పుష్పం వికసించింది. కోస్గి పట్టణంలోని వార్ల మల్లేశం ఇంట్లోని టెర్రస్ గార్డెన్‌లో మే పుష్పం వికసించి అందరినీ అకట్టుకుంటోంది. మే నెలలో మాత్రమే పుష్పించే ఈ మొక్క వృక్షరాజ్యంలో అమరిల్లిడేసి కుటుంబానికి చెందింది. కేవలం మే నెలలో మాత్రమే వికసిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని పాడేరు నుంచి తాను పదేళ్ల క్రితం ఈ మొక్క దుంపను తెచ్చి కుండీలో నాటానని.. ప్రతి ఏటా మే నెలలో ఒక పువ్వు మాత్రమే వచ్చేదని.. ఈసారి నాలుగు పువ్వులు వికసించాయని మల్లేశం తెలిపారు. జూన్ వరకు ఈ పుష్పాలు ఉంటాయన్నారు. – కోస్గి రూరల్

కలుపును ఇలా నివారిద్దాం

అలంపూర్ : వానాకాలం సాగు సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. పంటల సాగులో కలుపు సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. కలుపు వలన 30 నుంచి 70 శాతం పంట నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అయితే కలుపు నివారణకు రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పంట నష్టం జరగకుండా చూడొచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సూచిస్తున్నారు. వరిలో ఊడల నిర్మూలనకు విత్తనాన్ని నాటిన 14 రోజులకు ఎకరా నారుమడికి ప్రిటిలాక్లోర్ 400 మి.లీ లేదా సైహాల్‌పాప్‌బ్యూటైట్ 400 మి.లీ ద్రావకాన్ని 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి. లేదా ఊద వెడల్పాకు కలుపు సమపాళ్లలో ఉంటే నారుమడి విత్తిన 15 రోజులకు ఎకరాకు బిస్ పైరిబాక్ సోడియం(10) శాతం 200 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి.

మాగాణి వరిలో..

మాగాణి వరిలో ఊద వంటి ఏకవార్షిక గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా ఉంటే నాటిన 3 లేదా 5 రోజుల్లో పొలంలో పలుచగా నీరుంచి ఎకరాకు 1-1.5 లీ. బుటాక్లోర్ (50 శాతం) లేదా 400 మి.లీ చొప్పున అనిలోఫాస్ (30 శాతం) ప్రిటిలోక్లోర్ (50 శాతం) గానీ 20 కిలోలు పొడి ఇసుకలో కలిపి చల్లాలి. గడ్డి, తుంగ వెడల్పాటి ఆకు జాతీ మొక్కలు సమపాళ్లలో ఉంటే వరి నాటిన 3 లేక 5 రోజుల్లో 4కి బుటాక్లోర్ 5 శాతం గుళికలు+4కి 2.4-డీ ఇథైల్ ఎస్టర్ 4 శాతం గుళికలను 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి. నాటిన 20 నుంచి 30 రోజుల్లో వెడల్పాటి కలుపు ఎక్కువగా ఉంటే ఎకరాకు 400 గ్రాములు 2.4-డీ సోడియం సాల్ట్ (80 శాతం) లేదా ఇథాక్సి సల్ఫురాన్ 15 శాతం పొడిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



మొక్కజొన్న పంటలో పెరిగిన గరిక కలుపు

మొక్కజొన్న : మొక్కజొన్న విత్తిన వెంటనే లేదా 2-3 రోజుల్లో ఎకరాకు 1-1.5 కిలోల అట్రాజీన్ పిచికారీ చేయాలి. తర్వాత 30-35 రోజుల్లో గొర్రు గంటుకతో అంతర్ కృషి చేయాలి.

జొన్న : జొన్న విత్తిన వెంటనే లేదా 2-3 రోజుల్లో 600 నుంచి 800 గ్రాముల అట్రాజిన్‌ను విత్తిన 20 రోజుల తర్వాత అలాగే 400 గ్రాముల 2, 4-డీ సోడియం సాల్ట్ 80 శాతం పొడిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం మంచిది.



పొలంలో పెరిగే తిక్కబెండ

కంది : కంది విత్తిన వెంటనే 1-2 రోజుల్లో ఎకరాకు 1.1.3 లీ పెండి మిథాలీన్ వాడాలి. విత్తిన 30 లేక 60 రోజుల్లో గొర్ర గుంటకతో అంతర్ కృషి చేయాలి. లేదా ఇమజితాపీర్ ఎకరాకు 200 మి.లీ పిచికారి చేయాలి.

మినుము/పెసర : విత్తిన 1-2 రోజుల్లో ఎకరాకు 1-1.3 లీ పెండి మిథాలీన్‌ను విత్తిన 20 రోజులకు గడ్డి జాతి కలుపు నివారణకు 250 మి.లీ పెనాక్స్ ప్రాప్ ఇథైల్ 5 శాతం మందును 200 లీటర్ల నీటిలో కలిపి చల్లితే ప్రయోజనం ఉంటుంది.

కూరగాయ పంటల్లో :

వంగ, టామాటో, ఉల్లి, వెల్లుల్లి పంటలు నాటడానికి ముందు ఎకరాకు 1-1.3లీ పెండామిథాలీన్ లేదా 200 మి.లీ ఆక్సీఫ్లోరాఫెన్ పిచికారీ చేయాలి. ఉల్లి, వెల్లుల్లిల్లో నాటిన 15-20 రోజులకు నేలలో తేమ చూసుకొని 200 మి.లీ ఆక్సీఫ్లోరోఫెన్ కూడా వాడవచ్చు. బెండలో విత్తిన వెంటనే లేదా 12 రోజుల్లో ఎకరాకు 1-1.3 లీ. పెండిమిథాలీన్ లేదా 1.5-2 లీటర్ల అలాక్లోర్ చల్లాలి. క్యాబేజి, కాలీఫ్లవర్‌లో నాటడానికి 1 లేదా 3 రోజుల ముందు ఎకరాకు 200 మి.లీ ఆక్సీఫ్లోరోఫెన్ చల్లాలి. కంద, చేమ పెండలం వేస్తే కలుపు ఎక్కువగా వచ్చే భూముల్లో మొదటి దఫా తడి వచ్చాక ఎకరాకు 1.3 లీటర్ల పెండిమిథాలీన్ లేదా ఆక్సీఫ్లోరోఫెన్ పిచికారీ చేయాలి.

మినుములు : పొలంలో గడ్డిజాతి వెడల్పాకు ఉంటే ఎకరాకు 200 మి.లీ ఇమిజితాపిర్ 10 శాతం పొడితో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందు చల్లితే మినుము పెరుగుదల ఆగినప్పటికీ తిరిగి మాములు స్థితికి వస్తోంది.

శనగ : పైర్లు విత్తిన వెంటనే లేదా ఒకటి లేక రెండు రోజుల్లో ఎకరాకు 1-1.3 లీ. పెండిమిథాలీన్ పిచికారీ చేయాలి. సోయా చిక్కుడులో విత్తిన 20 రోజుల సమయంలో 250 మి.లీ ఇమజితాపిర్ మందు కూడ పిచికారీ చేయవచ్చును.